
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.8, కనిష్ఠం 8.2

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 11 జనవరి 2025

కాంగ్రెస్.. కమలం కయ్యం!







ప్రజాభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు (ఫైల్)

- కాంగ్రెస్, బీజేపీల మధ్య ముదురుతున్న పొలిటికల్ వార్
- రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్న 'కంది' వ్యాఖ్యలు
- ప్రజాభవన్‌పై దాడికి యత్నించిన బీజేపీ శ్రేణులు
- భూకబ్జాలు చేశారంటూ ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు
- పోటాపోటీగా ప్రెస్‌మీట్‌లు, సోషల్ మీడియాలో వైరల్
- ఎమ్మెల్యేపై సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్
- అధికార వర్గాల్లో మొదలైన అలజడి
- ప్రజాభవన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల వద్ద పోలీసుల బందోబస్తు

ఆదిలాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినా ఒకరిపై ఒకరు తీవ్రవిమర్శలు చేసుకుంటూ జిల్లా రాజకీయాలను హీటెక్కిస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేపై చేసిన ఘాటు వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం రేపుతున్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీల మధ్య వివాదం మరింతగా ముదురుతోంది. గత రెండు రోజులుగా కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఆగ్రహించిన బీజేపీ శ్రేణులు ప్రెస్‌మీట్ పెట్టి మరీ కందిని హెచ్చరించారు. అలాగే ప్రజాభవన్‌పై దాడిచేసేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఆ మరుసటి రోజే కంది శ్రీనివాస్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎమ్మెల్యేపై భూకబ్జాల ఆరోపణలు చేయడం తీవ్రమైన చర్చకు దారితీసింది. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేతలు జిల్లాలో పర్యటించిన తర్వాత ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే త్వరలో జరగబోయే స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పైచేయి సాధించేందుకే పోటాపోటీగా కాంగ్రెస్, కమలం పార్టీలు ఇలాంటి వివాదాలను తెరపైకి తెస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బహిరంగ చర్చకు సవాల్..

అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదంటూ పలువురు బీజేపీ శ్రేణులు హెచ్చరించడంతో కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి పక్కా ఆధారాలతో మీడియా ముందుకు వచ్చి వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్యే ఆయన అనుచరులు అసైన్డ్ భూములను కబ్జా చేస్తూ అమ్మేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు వ్యక్తం చేశారు. భూకబ్జాలకు సహకరించిన అధికారులను కూడా వదిలిపెట్టేది లేదంటూ హెచ్చరించారు. జిల్లా కేంద్రంతోపాటు మావల మండలంలోని పలు సర్వే నంబర్లలో భారీ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. భూ కబ్జాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమేనని, బీజేపీ సిద్ధమేనా? అంటూ సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌లోనూ స్థిరాస్తుల



ప్రజాభవన్ ముందు పోలీసుల బందోబస్తు

వివరాలు సక్రమంగా లేవని ఆరోపించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని ప్రకటించారు.

సీఎం దృష్టికి భూ అక్రమాల చిట్టా..

జిల్లాలో జరుగుతున్న భూ అక్రమాలపై పూర్తి ఆధారాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ధరణి ఆధారంగానే అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడి రికార్డులను తారుమారు చేస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ముఖ్యంగా మావల మండలం, ఆదిలాబాద్ అర్బన్ మండలాల పరిధిలోనే వందల కోట్ల భూ అక్రమాలు జరిగి ఉంటాయన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గత పదేళ్ల నుంచి ఈ రెండు మండలాల్లో జరిగిన భూరికార్డుల మార్పిడి, లావాదేవీలు, అమ్మకాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ వివరాలను మరింత లోతుగా పరిశీలిస్తే అసలు బాగోతం బయటపడే అవకాశం ఉందంటున్నారు.

రెవెన్యూశాఖలో చర్చ..

కాంగ్రెస్, బీజేపీల మధ్య ముదురుతున్న భూ వివాదాలతో రెవెన్యూశాఖలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఇరుపార్టీల నేతలు పోటాపోటీగా భూ అక్రమాలపై విమర్శలకు దిగడంతో అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది. జిల్లా కలెక్టర్‌తోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధం కావడంతో అక్రమాలు, అవినీతికి పాల్పడిన అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భూ అక్రమాలపై అధికార పార్టీ పట్టుబట్టడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. గతంలో మావల, ఆదిలాబాద్ అర్బన్ మండలాల పరిధిలో తహసీల్దార్‌లుగా పనిచేసిన పలువురు అధికారులు భారీ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. నకిలీ భూపత్రాలతోనే భూములను బదలాయించి లక్షల రూపాయలు జేబులో వేసుకున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయి విచారణ జరిపిస్తే పలువురు అధికారులకు ఇబ్బందులు తప్పవంటున్నారు.

అప్రమత్తమైన పోలీసులు..

ఇరుపార్టీల మధ్య వివాదం మరింతగా ముదరడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో కాంగ్రెస్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజాభవన్‌తోపాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి ర్యాలీలు, ఆందోళనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడుతున్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- బరంపూర్ తిరుమల కొండను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం : ఎంపీ, ఎమ్మెల్యేలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

తలమడుగు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ మహావిష్ణుకు ఎంతో ప్రీతిపాత్రమైన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని వైకుంఠద్వార దర్శనం కోసం ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ కొండపై వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అదిలాబాద్ ఎంపీ నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఆదిలాబాద్ డీఏసీ జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డిలు వెంకటస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా అలా అభివృద్ధి కోసం అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, రామ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, నల్ల పద్మాకర్ రెడ్డి, ఆసం రవి, ఆలయ పూజారి కళ్యాణ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చలితీవ్రత

- జిల్లాలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలితీవ్రత కనిపిస్తుంది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.8 కాగా, కనిష్ఠంగా 8.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టీ)లో అత్యల్పంగా 7.0 డిగ్రీల సెల్సీయస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బేలలో 7.4 డిగ్రీలు, బోథ్‌లో 8.1, మావలలో 8.4, జైనథ్‌లో 8.7, తాంసీలో 9.2 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి, పగలు అనే తేడాలేకుండా చలితీవ్రత కనిపిస్తుంది. ఉదయం, రాత్రి వేళల్లో చలి మంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందు తున్నారు. మరికొంత కాలంపాటు చలితో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

బోథ్, జనవరి (ఆంధ్రజ్యోతి) 10: మండలకేంద్రానికి చెందిన భగత్‌సింగ్ చౌక్‌లో నివాసం ఉంటున్న కాలేరు శేఖర్(34) అనే వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. శేఖర్ కూలి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉండడంతో భార్య పుట్టింటికిపోయింది. దీంతో మనస్థాపానికి గురైన ఆయన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి



నర్సాపూర్‌లో భవననిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ

తలమడుగు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్నా ఆదివాసుల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పార్టీలకు కచ్చితంగా అభివృద్ధి చేపడుతామని అదిలాబాద్ ఎంపీ నగేష్ బూత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లు అన్నారు. శుక్రవారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని బరంపూర్, గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడా, నర్సాపూర్, లక్ష్మం పురం పంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామాల్లో నూతన మంజూరైన మల్టీ పరపస్ సెంటర్ల నిర్మాణానికి భూమి పూజ ఎంపీ నగేష్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న ఆదివాసి గిరిజనులను అన్ని రంగాలు అభివృద్ధిపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేపడుతుందన్నారు. అదేవిధంగా పార్టీలకు అతీతంగా అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఆదివాసి కోలం గిరిజన గ్రామాల్లో నిర్మిస్తున్న ఒక్కో సెంటర్‌కి రూ. 60 లక్షల నిధులతో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ సెంటర్లో ఆదివాసులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా నిర్మాణ పనులు చేయాలని ఆదేశించారు. అనంతరం నర్సాపూర్ గ్రామానికి చెందిన శంకర్‌కు కిరణ్ షాపు కొరకు ట్రైక్రాన్ లోన్ కింద మంజూరైన రూ. రెండు లక్షల చెక్కును అందజేసి కిరణ షాపును ప్రారంభించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎలాంటి సమస్యలు ఉన్నా నియోజకవర్గ ఎమ్మెల్యేగా, ఒక అన్నగా అండగా నిలబడతానని అన్నారు. కార్యక్రమంలో ఐటిడి అధికారులు టిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేష్ కేదారేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్.



భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

మాజీ జెడ్పిటిసి ప్రభాకర్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, మాజీ ఎంపిటిసి రంజిత్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, రమాకాంత్, బిజెపి నాయకులు కిరణ్ .నారాయణరెడ్డి .ధనంజయ్ . కాంతారావు వామన్ తోట శ్రీనివాస్, తోట ప్రమోద్, తిరుమల గౌడ్, బిఆర్ఎస్ పార్టీలో నాయకులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

తాంసి : మండలంలోని లింగుడా గ్రామంలో నూతనంగా మల్టీ పర్పస్‌సెంటర్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో గ్రామంలో నిర్మాణం కోసం శుక్రవారం ఎంపీ, ఎమ్మెల్యేలు భూమిపూజ చేశారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే, ఎంపీలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ జీ నగేష్, బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి తన బాధ్యత అని అందరూ కలిస్తేనే ఏ అభివృద్ధి అయిన జరుగుతుందని అన్నారు.

రూ.30 లక్షల నిధులతో నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, జనవరి (ఆంధ్రజ్యోతి)10: మండల పరిధిలోని మాడగూడ గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గేడం నగేష్, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు కలిసి శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రాంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని వారి సౌలభ్యం కోసం ఆశ్రమ పాఠశాలలో రెండుతరగతి గదుల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులతో పనులు ప్రాంభించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిధిలో నాణ్యమైన విద్యతో పాటుగా భోజనవసతులను కల్పిస్తున్నామ న్నారు. విద్యార్థులకు మరో రెండు నెలల్లో పదోతరగతి పరీక్షలు జరుగనున్నాయి. విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షలు రాసి ఉత్తమమైన గ్రేడులను పొంది అటు పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరును తీసుకు రావాలన్నారు. వీటితో పాటుగానే క్రీడలలో కూడా ఉత్తమమైన ప్రతిభ కనబర్చేలా పీటీ ,పీడీల ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగానే శిక్షణ అందిస్తుందన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో విద్యార్థులు రాణించాలని వారి కి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల యాత్రను ప్రారంభించిన జడ్పీ మాజీచైర్మన్

ఉట్నూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రారంభంకానున్న ప్రయాగ్‌రాజ్ కుంభ మేళాకు ఉట్నూర్ నుంచి వెళ్తున్న భక్తుల సర్వీసును జడ్పీ మాజీ చైర్మన్‌రాథోడ్ జనార్ధన్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. మండలకేంద్రం నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న కుంభమేళాలో పాల్గొంటున్న భక్తులతో కలిసి ఆయన కూడా ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంభమేళాలో పాల్గొనడం అదృష్టంగా భావించి వెళ్తున్నామన్నారు. యాత్రలో జడ్పీ మాజీచైర్మన్‌తో పాటు తుకారం మహారాజ్, కొమ్మురాంచందర్, కొండ మాజీ ఎంపీటీసీ బాదా వత్ కళా వతి ఉత్తం, తులసీ మహారాజ్, భీంపూర్ మాజీ సర్పంచ్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.



భక్తుల వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్

బీజేపీ నాయకుల అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు

ఉట్నూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ నాయకుడు బిదురి రమేష్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఢిల్లీలో ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ స్టేట్‌యువజన అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోజ్జుపటేల్ ఆదేశాల మేరకు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీ నాయకుడు రమేష్ బిదురి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ అని ఖానాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఆత్రం రాహుల్‌దేవ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పరమేశ్వర్ రావ్, మండల యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుట రాజేశ్వర్, ఎర్రండి సుశీల్‌కుమార్, కలీం పాషా, భీమన్న, గంగేశ్, అశోక్, భాస్కర్, సల్మాన్‌రాజ్, కైలాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆధ్యాత్మిక చింతన అవసరం



వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న శ్రీకాంత్‌రెడ్డి

మావల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరమని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బంగారిగూడ వెంకటేశ్వర ఆలయంతో పాటు, బోథ్ నియోజకవర్గంలోని బరంపూర్ వెంకటేశ్వర ఆలయాలను సందర్శించారు. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉత్తరద్వార దర్శనంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకులు, మావల మాజీ ఎంపీపీ అట్లా గోవర్ధన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేములనాగరాజు, ప్రతాప్ కస్లాలా, రెండ్ల రాజన్న.మేకల సంజీవ్ యాదవ్, బండి నరసింహ చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటి ముట్టడి



ఉట్నూర్‌లో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తున్న ఆశావర్కర్లు

ఉట్నూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే బోజ్జు పటేల్ ఇంటి ముట్టడి కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ ఆధ్వర్యంలో ఉట్నూర్ డివిజన్‌లోని ఆశావర్కర్లు ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి తరలివచ్చారు. ఎమ్మెల్యే స్థానికంగా లేకపోవడంతో ఆశావర్కర్ల సంఘం నాయకులు ఎమ్మెల్యే పీఏ వేడ్మ భుజంగ్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నైతం శోభ మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే ఆశావర్కర్ల సమస్యలపై గొంతు వినిపించలేదని విచారం వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనైనా ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు, ఉద్యోగపదోన్నతులు, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత కల్పించేలా ఎమ్మెల్యే మాట్లాడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా సంఘం నాయకులు కాంత, నాగుబాయి, మంగవతి, తులసి, లక్ష్మి, సంగీత, జున బాయి పాల్గొన్నారు.

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

ఆదిలాబాద్ - 93983 85917
ఇచ్చోడ - 85000 38312

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న మండ విద్యాధికారి సునీల్

సిరికొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సిరికొండ మండల విద్యాధికారి సునీల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముందస్తుగా ముగ్గులపోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారి సునీల్ మాట్లాడారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సునీల్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు అన్ని కళల్లో రాణించాలని, ప్రతీ రంగంలో విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందడం కన్నా పాల్గొనడం ఉత్తమమని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలలను మించి నాణ్యమైన బోధనతోపాటు సకల సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాగులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాముల గంగారాం, ఉపాధ్యాయులు వేణుగోపాల్, ప్రతిమ, ప్రవళిక, కళ్యాణి, మానస, పుష్పలత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నర్సుబాయి, గ్రామస్తులు మహేష్, గుగ్గిళ్ళ స్వామి, గంగామణి, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు



ఉట్నూర్ ఎల్ఎఫ్ఎల్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న బాలికలు

ఉట్నూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో చివరి రోజైన శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు అలరించాయి. పాఠశాల విద్యార్థులను ఆసక్తిగా ముగ్గుల పోటీలలో పాల్గొన్నారని పాఠశాల కరస్పాండెంట్ రాము తెలిపారు. విజేతలకు బహుమతులు అందించామని ప్రిన్సిపల్ వివరించారు.

తెలంగాణ సాహిత్య సదస్సుకు కవి వెంకట్ ఎంపిక



బి. వెంకట్ కవి

ముథోల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ పద్య కవి, సాంస్కృత భాషా ప్రచార సమితి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు బి.వెంకట్ కామారెడ్డి జిల్లా చారిత్రక క్షేత్రం దోమకొండకోట సంస్థానంలో జనవరి 12వ తేదీన దోమకొండ ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ సాహిత్య సమాలోచన సదస్సుకు ఎంపికయ్యారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆచార్య సంగనభట్ల నర్సయ్య, తెలంగాణ విశ్వవిద్యాలయం కళలు పీఠాధిపతి ఆచార్య కరిమిండ్ల లావణ్య, పద్మభూషణ్, డా. కె‌ఈ. వరప్రసాదరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ సదస్సులో వెంకట్ విశిష్ట అతిథిగా హాజరై, తనదైన శైలిలో సమాలోచన చేయనున్నారు. తెలంగాణ ప్రాచీన సాహిత్యం, తెలంగాణ జానపద సాహిత్యం, సమాలోచనపై సందేశాలు ఇవ్వనున్నారు. కవి సమ్మేళనంలో దోమకొండ చరిత్రపై స్వీయ పద్యాలను ఆలపించనున్నారు. సాహిత్య సేవ, భాష, వ్యాకరణం, అలంకారాలు, చందస్సు, ప్రబంధాలు, గ్రామీణ సాంస్కృతి, కావ్యాలు, గేయాలు, పొడుపు కథలు, సామెతలు, ఇతిహాసం, పౌరాణిక కథలు, తదితర సాహిత్య పరమైన చర్చల్లో పాల్గొననున్నారు. తర్వాత సన్మానాన్ని స్వీకరించనున్నారు. సదస్సులో మల్లినాథ సూరి కళాపీఠం ఏడుపాయల సంస్థాన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు పబ్బ విజయలక్ష్మి, ముల్క ప్రవంతి, రామగిరి సుజాత, ప్రవీణ్ శర్మలు మొదలగు 11మందితో కూడిన కవి సమ్మేళనంలో పాల్గొననున్నారని వెంకట్ చెప్పారు.

నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా చొప్పదండి భవాని



నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న భవాని

ఖానాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా చొప్పదండి భవాని నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలకా లంబ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత మొగిలి శుక్రవారం హైదరాబాద్‌లో భవానికి నియామకపత్రం అందజేసినట్లు ఆమె ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. వరుసగా మూడోసారి మహిళా కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలుగా తనకు అవకాశం కల్పించిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సహా పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తామన్నారు.

మిషన్ భగీరథ నీరు అందివ్వాలని రాస్తారోకో



ముథోల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని న్యూ ముధ్గల్ గ్రామంలో బాసర - భైంసా రహదారిపై శుక్రవారం గ్రామస్థులు మిషన్ భగీరథ నీళ్ల సుమారు వారం రోజుల నుంచి అందక ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ఈ విషయం సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సుమారు 20 నిమిషాల పాటు రోడ్డుపై భైఠాయించి తమ నిరసనను వ్యక్తపరిచారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. వెంటనే ఎంపీడీవో శివ కుమార్‌కు ఫోన్ చేయడంతో ఎంపీడీవో సంఘటన స్థలానికి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. రోడ్డుపై రాస్తారోకో చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆలయాల్లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఆలయంలో పాల్గొన్న పార్లమెంటు సభ్యులు నగేష్



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాధవ్

బజార్‌హత్నూర్, జనవరి(ఆంధ్రజ్యోతి)10: వైకుంఠ ఏకాదశి సందర్భంగా జాతర్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరుని ఆలయంలో ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు నగేష్ శ్రీవారి సేవలో నిమగ్నమయ్యారు. ఉదయాన్నే ఆయన ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి భక్తులు ప్రసాదాన్ని పం పిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పంటలు సమృద్ధిగ పండాలని, ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నానని తెలిపారు.

నేరెడిగొండ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండలకేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారి దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బోథ్ ఎంపీపీ తుల‌శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులున్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ముథోల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మాదకద్రవాల్యను నిర్మూలిద్దాం... ఆత్మహత్యలను అరికడదామని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఉత్తమ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి అన్నారు. మండలంలోని ఎడ్‌బిడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'మాదక ద్రవ్యాల నిర్మూలన - ఆత్మహత్యలను అరికడదాం' అనే అంశంపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రజలలో అవగాహన కల్పించడానికి విద్యార్థులతో గ్రామంలోని ప్రధానకూడళ్లలో భారీ ర్యాలీ చేపట్టారు. మాదక ద్రవ్యాల వల్ల వచ్చే ప్రమాదాలు, అనారోగ్యాల గురించి వివరించారు. గంజాయి, గుట్కా, సిగరెట్, ఆల్కహాల్ వంటి మత్తు పానీయాలకు యువత ఆసక్తి చూపినట్లయితే వారి భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణరావు పటేల్ మాట్లాడుతూ... కవిత్వాల రూపంలో, పద్యాల రూపంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై, మత్తు పానీయాలపై వాటి వల్ల వచ్చే ప్రమాదాల గురించి చాలా చక్కగా వివరించారు. భైంసా మండల వర్కింగ్ కమిటీ చైర్మన్ బి. మహేందర్ రెడ్డి విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్య సాధన దిశలో ప్రయాణించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహాచార్యులు ప్రతినిధులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రికెట్ టోర్నమెంట్‌కు ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంజనీ తండా గ్రామంలో శ్రీ సాయి బంజారా యూత్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ యువత క్రీడల్లో రాణించి భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచడానికి ఈ టోర్నమెంట్ మంచి వేదికగా ఉపయోగించుకొని క్రికెట్ ఆడాలన్నారు. అలాగే సమత ఫౌండేషన్ మంచి ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి ప్రోత్సాహకంగా 5,000ల రూపాయల చెక్కును క్రికెట్ టోర్నమెంట్ మేనేజ్మెంట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ సీఈవో అనిల్ కుమార్, పీఆర్‌వో నరేష్ కుమార్, సమత ఫౌండేషన్ సభ్యులు ముత్యం, సాజిద్, వెంకటేష్, గౌడ్, సంతోష్, శ్రీను, తానాజీ, ఉత్తమం, పెద్ద సంఖ్యలో యువకులు, గ్రామ ప్రజలు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురా

లోకేశ్వరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అధ్యాపకులతో, విద్యార్థులతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడుతూ... త్వరలో ప్రయోగ పరీక్షలు, వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సమయాన్ని వృధా చేయకుండా ఒక ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. అదే విధంగా అధ్యాపకులతో సిలబస్, ప్రయోగ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో వాటిపై ఆరా తీశారు. ఈసారి ప్రతి ప్రయోగగదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే. గౌతమ్‌కు సూచించారు. అందువలన విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ తనిఖీల్లో కళాశాల ప్రిన్సిపాల్ కే. గౌతం, అధ్యాపకులు విఠల్, వెంకటేశ్వర్, ప్రమీల రాణి, జి. శ్రీనివాస్, నవీన్, ఎం. చిన్నయ్య, డి. మహేందర్, జి. సాయినాథ్, హరీష్, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

ఆశాల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఖానాపూర్ శాఖ డిమాండ్
- ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటుకు వినతిపత్రం అతికింపు



ఖానాపూర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటుకు వినతి పత్రం అతికిస్తున్న ఆశా కార్యకర్తలు

ఖానాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఖానాపూర్‌శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖానాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్ వేతనం రూ. 18 వేలు అమలుతో పాటు ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఆయా అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రాలలో ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇవ్వాలని తమ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యేను కలిసేందుకు క్యాంపు కార్యాలయానికి వచ్చామన్నారు.

క్యాంపు కార్యాలయంలో ఎవరు అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ గేటుకు వినతిపత్రాన్ని అతికించి వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ ఖానాపూర్ శాఖ నాయకులు పి. గంగామణి, స్వప్న, త్రివేణి, సంధ్య, కమల, స్వాతి, మమత, లక్ష్మీ, లావణ్య, సీపీఎం మండల నాయకులు నుంచుల నారాయణ, తదితరులున్నారు.

ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



సారంగాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతీగ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ రాజేష్‌మీనా అన్నారు. శుక్రవారం మండలంలో గల వైకుంఠపూర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణను అరికట్టవచ్చన్నారు. అతి చిన్న గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలను అభినందించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలను ఇచ్చి రికార్డులను పరిశీలించారు. విధులు నిర్వహించే సమయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందితో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌తో పాటు పోలీస్ సిబ్బందిలు ఉన్నారు.

కోతుల కుటుంబ నియంత్రణ చికిత్స కేంద్రాన్ని పర్యవేక్షించిన అటవీ సంరక్షణ అధికారి సువర్ణ

సారంగాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల గండిరామన్న పార్క్‌లో ఉన్నటువంటి కోతుల కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని శుక్రవారం అటవీ సంరక్షణ అధికారిణి సువర్ణ పర్యవేక్షించి డాక్టర్ శ్రీకర్ రాజును కోతుల కుటుంబ నియంత్రణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైనా మాంజాను నివారిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే వాల్ పోస్టర్లను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శర్వానన్, ఐఎఫ్ఎస్ షేక్ ఆదాం, జిల్లా అటవీ శాఖ అధికారిణి నాగిని భాను, అటవీ శాఖ అధికారులు రవీందర్, రామకృష్ణ, వేణుగోపాల్, అవినాష్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

శ్రీవారి సేవలో ఖానాపూర్ ఎమ్మెల్యే



శ్రీవారి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్ : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని, నియోజక వర్గం అభివృద్ధి చెందాలని స్వామి వారిని వేడుకున్నానన్నారు.

సర్పంచ్‌లకు పెండింగ్ బిల్స్ విడుదల చేయాలి

సర్పంచ్‌ల సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు తిరుక్కోవెల వినోద్‌కుమార్



సోన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గత ఐదు సంవత్సరాలుగా సర్పంచ్ పదవీకాలంలో ప్రభుత్వం నిర్దేశించినటువంటి పనులను తూచా తప్పకుండా సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తిరుక్కోవెల వినోద్‌కుమార్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎఫ్ఎఫ్‌సీ నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు, జనరల్ ఫండ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీపీ పనులను పూర్తి చేశారన్నారు. సర్పంచ్‌లు గ్రామంలో అభివృద్ధి చేసినటువంటి పనులకు బిల్లులు రాక ఎందరో మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. గ్రామ సర్పంచ్‌లు ఆర్థికంగా ఎంతో చిక్కిపోయారని, సర్పంచ్ పదవి కాలం ముగిసి సంవత్సరం కావస్తున్నా సర్పంచ్‌లకు రావలసినటువంటి పెండింగ్ బకాయిలు ఇంతవరకు ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. పెండింగ్ బకాయిలను విడుదల చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వెళ్లాలని మేము ఈ ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎకనామిక్స్ అధ్యాపకురాలు సుమతి

దిలావర్‌పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకురాలు సుమతి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేస్తున్న 'ఆహ్లాదకరమైన కళాశాల, ఆరోగ్యకరమైన అలవాట్లు' ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల అంశంపై శుక్రవారం ఎకానమిక్స్ అధ్యాపకురాలు సుమతి అవగాహన కల్పించారు. వేసవి, వర్షం, చలి కాలాల్లో ఆ సీజన్‌ను బట్టి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు మన దరి చేరవన్నారు. ఏ సీజన్‌లో ఏ వ్యాధి వచ్చినా తట్టుకున నిలబడేందుకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి ప్రమాదకర వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఈగలు, దోమల వల్లనే వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి దోమ తెరలు వాడాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల కలరా వ్యాధి వస్తుందని, సంతులిత ఆహారాన్ని, పరిశుభ్రమైన నీరు తాగాలన్నారు. అలాగే గాలి కలుషితం అవ్వడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, స్వచ్ఛమైన గాలిని పొందేందుకు విరివిగా మొక్కలు నాటాలని, పచ్చదనం కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



తానూర్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు

తానూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే రామారావుపాటిల్ లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మంజూరయిన 32చెక్కులను కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మామడలో జడ్పీ మాజీ చైర్మన్ ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ విజయలక్ష్మి

మామడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకా దశి పురస్కరించుకొని శుక్రవా రం మామడ మండల కేంద్రం లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో నిర్మల్ మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో నాయకులు చంద్రశేఖర్ గౌడ్, హన్మగౌడ్, మేకం అశోక్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కుంటాల, జనవరి, 10 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూర్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్ ఆధ్వర్యంలో పదవ తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేశ్వర్, స్థానికులు చిన్నారెడ్డి, రమణ గౌడ్, లక్ష్మణ్ పటేల్, దశరథ్ రజనీకాంత్‌లు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, అంతేగాకుండా విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేసిన డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్‌ను అభినందించారు.

ఫటా..ఫట్...

భూ భారతి చట్టం రైతులకు వరం

● ఖానాపూర్ తహసీల్దార్ మామిడి శివరాజ్



ఖానాపూర్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెస్తున్న భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిదని ఖానాపూర్ తహసీల్దార్ మామిడి శివరాజ్ పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన భూ భారతి గురించి పలు విషయాలు పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు భూభారతి చట్టం పరిష్కారం చూపుతుందా?

అధికారి: ధరణి పోర్టల్ ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని అందుబాటులోకి వస్తోంది. ఈ చట్టంతో పెండింగ్‌లో ఉన్న పలు రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

ఆంధ్రజ్యోతి: ఖానాపూర్‌లో ఇసుక, మొరం లాంటి ప్రకృతి వనరుల దోపిడీ జోరుగా సాగుతోందనే ఆరోపణలున్నాయి. అరికట్టేందుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

అధికారి: ఇసుక, మొరం అక్రమ తరలింపు ఆగాలంటే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో మాకున్న సమాచారం మేరకు ఈ నెల 7న ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి మా సిబ్బందిని పంపితే అక్కడ ఇసుక మాఫియా రెవెన్యూఅధికారులపై దాడికి ప్రయత్నించింది. భయంతో అధికారులు వెనక్కివచ్చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన సకాలంలో స్పందించలేకపోయారు.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు చేపడతామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్ ప్రాంతానికి ప్రత్యేకమైన ఆదేశాలు ఏమైనా వచ్చాయా?

అధికారి: ఇసుకను అక్రమంగా తరలించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందిగా మైనింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఇంకా ఇప్పటివరకు ఖానాపూర్ ప్రాంతంలో ఇసుక, మొరం అక్రమంగా తరలించకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఇసుక, మొరం మాఫియాను ఎదుర్కొనేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం అవసరం.

ఆంధ్రజ్యోతి: ఖానాపూర్ తహసీల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా?

అధికారి: ప్రతీసారి భవనం పరిస్థితి గురించి జిల్లా ఉన్నతాధికారులు తమను అడిగి తెలుసుకుంటున్నారు. అయినప్పటికీ నూతన భవన నిర్మాణానికి ఎటువంటి నిధులు మంజూరు కావడం లేదు. ప్రస్తుతం రికార్డులు భద్రపరచు గది కూడా సరిగా లేక తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని భవనంలో విధులు నిర్వహించలేక రేకుల షెడ్డు కింద సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆంధ్రజ్యోతి: ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి సరిపడా సిబ్బంది ఉన్నారా?

అధికారి: ఇతర సిబ్బంది కొరత లేనప్పటికీ కార్యాలయంలో ముఖ్యమైన విధులను నిర్వహించాల్సిన సీనియర్ అసిస్టెంట్ అనధికార డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో సీనియర్ అసిస్టెంట్ చేయాల్సిన పనుల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది.

అలరించిన ముందస్తు సంక్రాంతి

భైంసా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి ముందస్తు వేడుకలు అలరించా యి. శ్రీ గౌతమి హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు ఆహూతులను విశేషంగా అలరారించాయి. ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు కొనసాగిన వేడుకలు ఆద్యాంతం సంస్కృతి, సంప్రదాయాలు, అచార వ్యవహరాలను ప్రతిబింబించేలా కొనసాగాయి. బోగి మంటలు వేయడం మొదలు కొని నోములు పంచుకునే వరకు చేపట్టిన కార్యక్రమాలు అందరినీ ఆక ట్టుకునే రీతిలో కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీగౌత మి హైస్కూల్ కరస్పాండెంట్ రేగుంట రవి, సలహాదారుడు పల్లికొండ బాలాజీ, అకాడమిక్ సలహాదారుడు వినాయక్‌రావ్‌లు మాట్లాడుతూ పర్వదినాల ప్రాముఖ్యత, విశిష్టతలపై ప్రతీవిద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ముథోల్: ముథోల్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్, అక్షర పాఠశాల, రబింద్ర ఉన్నత పాఠశాల, మండలంలోని ఫ్యూ చర్ కాన్సెప్ట్ స్కూల్, శ్రీవిద్యా స్కూల్, భాష్యం స్కూల్‌తో పాటు ఆయా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరా లు అంబరాన్ని అంటాయి. విద్యార్థినులు తెలుగుదనం ఉ ట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. హరిదాసు, రై తులు తదితర వేషాలు ఆకట్టుకున్నాయి.

విజయ పాఠశాలలో..

నిర్మల్‌అర్బన్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని విజయ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘ నంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో బాలికలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు గాలిపటాలను త యారు చేసి, ఎగురవేసి ఆనందించారు. విద్యాలయం చైర్మన్ నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని, వ్యవసాయదారులు పండించిన పంటలన్నీ ఇంటికి చేరుకోవడం వలన రైతులందరూ సంతోషగా ఈ సంక్రాంతి పండుగ జరుపుకుంటారని తెలి పారు. వైస్‌ప్రెసిడెంట్ అంబారాణి మాట్లాడుతూ మహిళ లందరూ పండగరోజు ముగ్గులను గొబ్బెమ్మలతో అలంక రించి, సంక్రాంతి నోములు నోచుకుంటాని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాలయం కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషనం, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ సామ మోహన్, ఉపా ధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వశిష్ఠ ఇంపల్స్ ఈటెక్నో స్కూల్‌లో..

నిర్మల్ అర్బన్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): నిర్మ ల్‌లోని వశిష్ఠ ఇంపల్స్ ఈటెక్నో స్కూల్ ఆదర్శనగ ర్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను జరుపు కున్నారు. విద్యార్థులు భోగి పండ్లు పోయడం, గాలిపటాలు ఎగురవేయడం, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తరతరాలు గా వస్తున్న సాంస్కృతి సాంప్రదాయాలను ఆచరి స్తూ వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోటీలో విజేతల కు పాఠశాల ప్రిన్సిపాల్ గొల్లపల్లి మాధవి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దేవిదాస్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంక్రాంతి విశిష్టతను తెలిపేలా ఏర్పాటుచేసిన ప్రదర్శన



సంబరాలు జరుపుకుంటున్న పాఠశాల సిబ్బంది

రవి హైస్కూల్‌లో..

నిర్మల్ అర్బన్: పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల రవి హైస్కూల్ లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు హరిదాసు వేషాలతో చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. విద్యార్థులకు ముగ్గుల పోటీ లు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ రంగవల్లుల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సి పాల్ రాణి, కరస్పాండెంట్ వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు వేస్తున్న ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రాణి

రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా రవాణా శాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్

ఉట్నూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఐటీడీఏ వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రవా ణాశాఖ నియమనిబంధనలు పాటిస్తూ భద్రతగా వాహనాలు నడపాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా వాహనదారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ సామ ప్రభాకర్ రెడ్డి, ఎంవీఐ మార్గం రవీందర్, ఏఎంవీఐ రవీందర్, హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్, కామేష్ కేబుల్ కలీం, ఇలియాస్ ఖాన్ ఉన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. **నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బౌరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మస్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలనే తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 20-01-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 5-7-100/5, 1 వ అంతస్తు,అప్పలనర్సయ్య కాంప్లెక్స్, నిర్మల్ -504106

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
NIRMLPJ2407030011	DHONIGIRI SAIKUMAR	NIRMLPJ2407120006	LINGAVVA MEESALA
NIRMLPJ2407030010	PEDDINTI SAYANNA	NIRMLPJ2407310002	FASI MOHAMMAD
NIRMLPJ2407060010	GOSANGI VIKRAM	NIRMLPJ2407250012	RAMESH THOGITI
NIRMLPJ2407080014	PRAVEEN KODUGOLLA	NIRMLPJ2407250011	KIRAN KUMAR PANDENA
NIRMLPJ2407090017	ADUMULLA LAVANYA	NIRMLPJ2407250008	KIRAN KUMAR PANDENA
NIRMLPJ2407100003	RAVIKUMAR CHILUMULA	NIRMLPJ2407250013	LAVANYA THOGITI
NIRMLPJ2407120007	SURESH NAKIDI	NIRMLPJ2407270007	THIRUMALA KALPANA
NIRMLPJ2407190014	SURESH NAKIDI	NIRMLPJ2407300013	SAHENDER TOKALA
NIRMLPJ2407190013	CHINNA LAXMI KORRI	NIRMLPJ2407300006	GANDLA NAVEEN KUMAR
NIRMLPJ2407200014	SIRGAPUR VIJAYA		

వేలం తేది: 20-01-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 6-7-74/1&2, 2 వ అంతస్తు,భుక్తాపూర్,ఆదిలాబాద్-504001

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ADILDPJ2407030003	ANNAVAJJALA DAYASAGAR	ADILDPJ2407230008	VISHAL MADHAV RAO SHINDE
ADILDPJ2407100001	JILPELLI SAI CHARAN	ADILDPJ2407230006	SHAIK SHARIF

వేలం తేది: 20-01-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 3-1-92/18, 1 వ అంతస్తు,నిజామాబాద్ రోడ్,ఆర్మూర్ జిల్లా,నిజామాబాద్-503224,తెలంగాణ

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ARMOOPJ2407100004	ABRAR AHMAD	BHGALPJ2407270001	PALLAPU RAMACHANDRAIAH
ARMOOPJ2407220005	SHAIK WASEEM HUSSAIN	BHGALPJ2407300009	THOGATI NARSIAH
ARMOOPJ2407260002	MOTHE ASHOK	BHGALPJ2408010008	THOGATI HARISH

వేలం తేది: 20-01-2025, వేలం చిరునామా : శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి.నం. 1-5-78/48/1, 1 వ అంతస్తు,మహాలక్ష్మి జ్యువెలరి మార్కెట్ ఎదురుగా,పాత పోస్టాఫీసు,భైంసా,ఆదిలాబాద్ జిల్లా-503103,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CDBHSPJ2404110001	VADNALA NARESH	CDBHSPJ2407300002	KOTTAKAPU SANJU
CDBHSPJ2407130016	EDLA LAXMI	CDBHSPJ2407310010	APARNA KADHAM
CDBHSPJ2404180009	CHIPIRI SAINATH		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ యం.అశోక్ కుమార్** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటి రోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 11.01.2025 సం/- అధీకృత అధికారి
స్థలం: నిజామాబాద్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్

ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు.



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య





పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ఆంధ్రజ్యోతి ABN

యవ్వనపు చర్మ రహస్యం SANTOOR Skin Moisturising Sandal & Turmeric

సెల్సియా ట్రెండీ మహిళల లో దుస్తులు
BRA - PANTIES - SLIPS & LEGGINGS
TRADE ENQUIRY : 93445 53675

ఎటువంటి పంటలకైనా క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్ సేంద్రియ సాగు - అధిక దిగుబడి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టౌన్ సబ్ స్టేషన్ నెలవారి మరమ్మతుల కారణంగా ఉదయం 9:30 గంటల నుంచి 12:30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, కావునా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

నాలుగు మండలాలకు..

ఖానాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ నాలుగు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఖానాపూర్ ఏడీఈ లక్ష్మణ్ నాయక్ తెలిపారు. ఈ విషయాన్ని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

వరదలకు కూలిన వంతెనలకు మరమ్మతులు







గంగాపూర్ వంతెన నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు (ఫైల్)

- కడెం మండలం గంగాపూర్ వంతెన నిర్మాణానికి రూ. 22 కోట్ల నిధుల మంజూరు
- పెంబి మండలం పసుపుల వంతెన నిర్మాణానికి రూ. 5.50 కోట్లు..
- రెంకోని వాగుపై రూ. 9.90 కోట్ల నిధులతో కొనసాగుతున్న రెండు వంతెనల నిర్మాణాలు
- త్వరలో ప్రారంభం కానున్న పసుపుల, గంగాపూర్ వంతెనల నిర్మాణ పనులు
- చేసిన పనులకు బిల్లులందక నిలిచిన రెంకోని వాగు వంతెన నిర్మాణం
- రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేస్తే బాగుంటుందంటున్న ప్రజలు

ఖానాపూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత రెండు, మూడేళ్లుగా వరుసగా వరదలు సృష్టించిన బీభత్సానికి రోడ్లు, వంతెనలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రోడ్లను, వంతెనలను తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గత మూడేళ్లుగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గంలో పలు వంతెనలు తెగిపోయాయి. పెంబి మండలంలోని పసుపుల వంతెన పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయ్యి రాకపోకలు ప్రారంభమైనప్పటికీ భారీ వరదల దాటికి ఆ వంతెన కుప్పకూలింది. కడెం మండలంలోని గంగాపూర్ ప్రాంతానికి ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్‌కు మధ్యన నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనులు సైతం వరద ఉధృతికి చెల్లాచెదురయ్యాయి. ఖానాపూర్ పట్టణం నుండి తర్లపాడ్, దిలావర్‌పూర్ గ్రామాల వైపు వెళ్లే రహదారిపై రెండుచోట్ల రెంకోని వాగుపై వరద ఉధృతికి రెండు వంతెనలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఈ నాలుగు వంతెనలను నిర్మించి తిరిగి రవాణా వ్యవస్థను గాడిలో పెట్టేలా తెలంగాణ ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఇదివరకే రెంకోని వాగుపై వంతెన నిర్మాణ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో తాజాగా గంగాపూర్ పసుపుల వంతెన నిర్మాణానికి సైతం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలో పలు మారుమూల గ్రామాలు మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించేందుకు వీలుగా రూ.5.45 కోట్ల నిధులతో పసుపుల సమీపంలో వాగుపై వంతెన నిర్మాణం చేశారు. ఈ వంతెన నిర్మించిన ఏడాది కాలంలోనే వరదలు భారీగా రావడంతో వంతెన కుప్పకూలింది. దీంతో పసుపుల పరిధిలోని పసుపుల, హరిచంద్‌తండా, అంకెన, రాయదారి, తులసిపేట్, పోచంపల్లి గ్రామాల ప్రజలు వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ గత తెలంగాణ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి రూ. 5.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇంకా పనులను మాత్రం ప్రారంభించలేదు. పలుమార్లు టెండర్లను పిలిచినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. కడెం మండలంలోని గంగాపూర్ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 9.50 కోట్ల నిధులతో పనులు ప్రారంభించినప్పటికీ ఆ పనులు రూ. 1.10 కోట్ల నిధులు ఖర్చు చేసి కొంతమేర నిర్వహించగా వరదల ఉధృతికి అవి దెబ్బతిన్నాయి. దీంతో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం గంగాపూర్ వంతెన నిర్మాణానికి రూ. 22 కోట్లను మంజూరు చేసింది. తాజాగా మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, తదితరులు గంగాపూర్‌ను సందర్శించి మంత్రి సీతక్క చేతుల మీదుగా నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఇప్పటివరకు ఇంకా పనులు మాత్రం ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎలక్ట్రికల్ సమస్యతో పనులు ప్రారంభం కాలేదని చెబుతున్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రం నుంచి తర్లపాడ్, దిలావర్‌పూర్ వైపు వెళ్లే రహదారులపై రెంకోని వాగుపై రెండు వంతెనల నిర్మాణానికి సుమారు రూ. 9.90 కోట్లకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణ పనులను నిర్వహిస్తున్నారు. కాగా ఖానాపూర్, తర్లపాడ్ రహదారిపై ఉన్న వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నప్పటికీ ఖానాపూర్, దిలావర్‌పూర్ రహదారిపై దెబ్బతిన్న రెంకోని వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో ఆ వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాకాలంలోపు పూర్తి చేయాలంటున్న ప్రజలు

గత రెండు, మూడేళ్లుగా ప్రకృతి సృష్టించిన బీభత్సానికి కకావికలమైన రోడ్లు, వంతెనల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం కొన్నిచోట్ల మరమ్మతులు మరికొన్ని చోట్ల కొత్త నిర్మాణాలకు నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగానే ఖానాపూర్ నియోజకవర్గంలో సైతం పలు వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కడెం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన గంగాపూర్ పరిసర ప్రాంత గ్రామాల రాకపోకలకు అనువుగా ఉండేందుకు గంగాపూర్, ఎర్వచింతల్ గ్రామాల మధ్య కడెం వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 22 కోట్లను మంజూరు చేసింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే గంగాపూర్‌తో పాటు మరో పన్నెండు గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. వంతెన లేక ప్రతీ వర్షాకాలం నాటు పడవలపై వాగులు దాటి ఎందరో మంది ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ఆరంభానికి మరో ఆరు నెలల సమయం ఉన్నందున గంగాపూర్ వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తే బాగుంటుందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. నిర్మించిన ఏడాదిన్నర కాలంలోనే భారీ వరదల దాటికి తెప్పలా తేలి కొట్టుకుపోయిన పెంబి మండలం పసుపుల బ్రిడ్జి పునర్నిర్మాణానికి సైతం ప్రభుత్వం నుంచి రూ.5.5 కోట్ల నిధులు మంజూరు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులను ఇంకా ప్రారంభించలేదని చెబుతున్న అధికారులు త్వరలోనే పనులను ప్రారంభిస్తామంటున్నారు. ఇటీవల గంగాపూర్ వంతెన నిర్మాణ పనులను మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించిన నేపథ్యంలో పసుపుల వంతెన నిర్మాణ పనులను సైతం ప్రారంభించి రెండు వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలని ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలు కోరుతున్నారు. రెంకోని వాగుపై రూ. 5.20 కోట్లు, రూ. 4.70 కోట్లతో నిర్మిస్తున్న రెండు వంతెనల్లో కేవలం ఒక వంతెన పనులు మాత్రమే వేగంగా ముందుకు సాగుతుండడం మరో వంతెన పనులు నిలిచిపోవడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనల నిర్మాణాల పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులందక నిలిచిపోతున్న పనులు

వంతెనల నిర్మాణానికి నిధులను మంజూరు చేసిన ప్రభుత్వం పనులను నిర్వహిస్తున్న సమయంలో అదే స్థాయిలో బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఖానాపూర్ నియోజకవర్గ కేంద్ర సమీపంలో దిలావర్‌పూర్, ఖానాపూర్ మధ్యలో రెంకోని వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం తాలూకు కాంట్రాక్టర్‌కు బిల్లులు రావడం లేదని చెబుతున్నారు. రూ. 5.20 కోట్లతో చేపట్టిన ఈ వంతెన పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. చేసిన పనులకు వెంట వెంటనే బిల్లులు చేస్తే తప్పా తాము పనులు చేయలేమని కాంట్రాక్టర్ చేతులు ఎత్తేసినట్లు చెబుతున్నారు. సదరు వంతెనకు సంబంధించిన మిగతా పనులను నిర్వహించాలని ఇతర కాంట్రాక్టర్లను కోరినప్పటికీ ఎవరు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. పనులను ప్రారంభించడంలో ఉన్న ఉత్సాహం చివరికి ఆ పనులు నిర్వహిస్తున్న వారికి అందించాల్సిన బిల్లుల మంజూరులో లేకపోవడంతోనే వంతెనల నిర్మాణ పనులు మందకోడిగా సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రానున్న వర్షాకాలంలోపు పనులు పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిలిచిపోయిన పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం.

ఖానాపూర్ నియోజకవర్గంలో రెంకోని వాగుపై నిర్మిస్తున్న రెండు వంతెనల్లో ఒక వంతెన నిర్మాణ పనులు దాదాపు చివరిదశలో ఉన్నాయి. మరో వంతెన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని మధ్యలో నిలిపేశాడు. పనులను ప్రారంభించాలని సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ఇతర కాంట్రాక్టర్లు ఎవరైనా ముందుకు వస్తే మిగతా పనికి అగ్రిమెంట్ చేసి వారికి అప్పగించేందుకు సైతం సిద్ధంగా ఉన్నాం.

- అశోక్ కుమార్ (ఆర్‌అండ్ బీ ఈఈ, నిర్మల్)



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన దిలావర్‌పూర్ - ఖానాపూర్ వంతెన పనులు (ఫైల్)


కాండ్లీ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న కాండ్లీ గ్రామస్థులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : దిలావర్‌పూర్ మండలం సముందర్‌పల్లి గ్రామ అనుబంధ గ్రామ పంచాయతీగా ఉన్న కాండ్లీ గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తమ కాండ్లీ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిప్రతం ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సానుకూలంగా స్పందించి ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తక్కల విద్యాసాగర్‌రెడ్డి, యూ.సాయినాథ్, శ్రీకాంత్, సాయికృష్ణ, గంగన్న, టి. పోశెట్టి, గణపతి, నర్సయ్య, మల్లన్న, తదితరులు ఉన్నారు.

కదిలిని గ్రామ పంచాయతీగా చేయాలని వినతి



శ్రీహరిరావుకు వినతిపత్రం ఇస్తున్న కదిలి గ్రామస్థులు

దిలావర్‌పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మాడెగాం అనుబంధ గ్రామంగా కొనసాగుతున్న కదిలిని గ్రామ పంచాయతీగా చేయాలని ఆ గ్రామస్థులు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావుకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామ పంచాయతీకి కావాల్సిన అన్ని రకాల అర్హతలు తమ గ్రామానికి ఉన్నాయని, గ్రామ పంచాయతీగా గుర్తించి అభివృద్ధి చేయాలని ఆ గ్రామ వీడీసీ సభ్యులు కోరారు. మారుతి పటేల్, దత్తు పటేల్, దిగంబర్ పటేల్, దేవేందర్ రెడ్డి, అనిల్, వెంకట్ రావు, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ చెక్కు అందజేత

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన వి. చంద్రం అనే వ్యక్తి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 2,50,000ల ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శుక్రవారం అందజేశారు.

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

నిర్మల్ - 99854 03060

భైంసా - 81258 56776

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

భక్తి శ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- జిల్లాలో ఉపవాస దీక్షతో వైష్ణవ దేవాలయాలను దర్శించుకున్న భక్తులు
- ఆలయాల్లో పల్లకీ సేవలు.. భజనలు.. అభిషేకాలు



జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్టలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి తెలిపారు. ఉదయం 6 గంటలకు పల్లకీసేవ కార్యక్రమం, తదనంతరం ఉత్తరద్వార ప్రవేశం, తిరుప్పావై ప్రబంధనం హారతి ఆ తర్వాత వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అల్లోలవినోదమ్మ మురళీధర్‌రెడ్డి దంపతులు వారితో పాటు ఆలయ గురుస్వామి మూర్తి, వికాస తరంగిణి సభ్యులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

మురళీకృష్ణ ఆలయంలో పూజలు

పట్టణంలోని గాంధీచౌక్ వద్ద గల మురళీకృష్ణ ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అర్చన, హారతి, అనంతరం ఉత్సవ మూర్తిని ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించి తర్వాత ఉత్తర ద్వార దర్శనం కల్పించినట్లు తెలిపారు.

దేవరకోట ఆలయాన్ని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు

పట్టణంలోని పురాతనమైన దేవకోట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గండి రామన్న సాయిబాబా ఆలయ చైర్మన్ గంగోని భూరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాందేడపు చిన్ను, తదితరులు పాల్గొన్నారు.



పొన్కల్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో..

మామడ మండలంలో..

మామడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మండల కేంద్రంతో పాటు పొన్కల్ గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఉదయం 4 గంటల నుంచి మహిళలు ఆలయాల్లో మంగళహారతులతో పూజ నిర్వహించారు. అర్చకులు విజయసారథి భక్తులకు స్వామివారి విశిష్టత వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దిలావర్‌పూర్ మండలంలో..

దిలావర్‌పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుండంపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, దిలావర్‌పూర్‌లోని శ్రీ ఏక్‌నాథ్ ఆలయం, కాల్వలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కదిలిలోని శ్రీ పాపహరేశ్వర స్వామి ఆలయాలకు భారీగా తరలివచ్చారు. గుండంపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఉత్తరద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేశారు. పుష్పాలు, తులసీదళాలు సమర్పించారు. మంగళహారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

కుంటాల, జనవరి, 10 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో వైకుంఠ ఏకాదశిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో భక్తులకు ఉత్తరద్వారం నుంచి దర్శనం కల్పించారు. ఈ దర్శనానికి గ్రామంలోని భక్తులే కాకుండా మండలం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



పొన్కల్ ఆలయంలో మంగళహారతులతో హాజరైన మహిళలు

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

నిర్మల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధికారి ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ... సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఫిబ్రవరి 7న వేల డప్పులు, లక్ష గొంతుకలు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. అప్పటిలోపు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి మాదిగ పల్లెల నుంచి వందలాది డప్పులతో మందకృష్ణ మాదిగకి స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు నంద కుమార్ మాదిగ, శనిగారపు రవి మాదిగ, కత్తి నాగబాబు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం


- రూ. 10లక్షల వరకు ఆస్తి నష్టం



కుభీర్‌లో అగ్నిప్రమాద దృశ్యాలు

కుభీర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మండల కేంద్రంలోని అన్నపూర్ణ ఎంటర్‌ప్రైజెస్ దుకాణం శనివారం రాత్రి 11.30 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారి రవి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దుకాణం యజమాని గాజుల లింబాద్రి రోజు మాదిరిగానే దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. రాత్రి దాదాపు 11గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి దుకాణంలోని ఎలక్ట్రికల్ వస్తువులకు నిప్పంటుకుంది. అందులో ఉన్న టీవీలు , ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దుకాణంలో నిప్పులు చెలరేగడం గమనించిన స్థానికులు, పోలీసులకు అగ్నిమాపక శాఖ అధికారులకు అగ్నిప్రమాదం జరిగినట్లు తెలియజేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది రాజు, విలాస్, సుదీప్‌కుమార్‌లు శకటంతో చేరుకొని మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ. పది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

ధర రాకపోవడంతో వేలంపాట వాయిదా



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్గల్ గ్రామ శివారులో గల ప్రభుత్వ ఉద్యానవనంలో ఉన్న వెదురు కర్రలను (ప్రభుత్వ మోడల్ బాంబూ ఫారం) శుక్రవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. అయితే ఈ వేలంపాటలో ఆయా జిల్లాల నుండి పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. కానీ అనుకున్నంత ధర రాకపోవడంతో ఈ వేలంపాట వాయిదా వేసినట్లు జిల్లా ఉద్యానవన అధికారి బి.వి రమణ తెలిపారు. మరలా వేలం వేసే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.వి. రమణ, ఏడీఏ వినయ్ బాబు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివ కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నంద్యా నాయక్, ఏవో రచన, భైంసా అగ్రికల్చర్ ఆఫీసర్ జావిద్ పాషా, బీట్ ఆఫీసర్ కృష్ణ, వివిధ జిల్లాల నుండి వెదురు కొనుగోలుదారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

నర్సాపూర్(జి), జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగకు ఇళ్లకు తాళం వేసి ఊరు వెళ్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయికిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊరు వెళ్లేవారు తమ అడ్రస్, సెల్ నెంబర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చి వెళ్లాలన్నారు. ఇంటి తాళాలను పూల కుండీలు, డోర్ మ్యాట్స్, రాక్స్‌లో పెట్టకుండా వెంట తీసుకువెళ్లాలని కోరారు. ఇంటిలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆన్‌లైన్ ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.